


# సమాధి

<u>*దేవుని పరిశుద్ధ నామమునకు మహిమ కలుగును గాక!*</u>

**సమాధి** అనగానే చనిపోయిన మనిషిని పెట్టి భూమిలోని గుంత చుట్టు కట్టడమో లేక రాతిలో తొలచిన కట్టడమో అనుకోకండి. కొంత మంది నోర్లు, ***కంఠములు అంత కంటే ఘోరం. నోరు తెరిస్తే కంపు. దేవునికి ఇంపైనవి లేవు కనుక కంపు. (యెహోవా భయము-దేవునికి ఇంపైన సువాసన message no. 38 చదవండి.)***

1. ***కంఠము:***

కీర్తనల గ్రంథము 5:9 వారి **నోట యథార్థత లేదు వారి అంతరంగము నాశనకరమైన గుంట వారి కంఠము తెరచిన సమాధి** వారు నాలుకతో ఇచ్చకములాడుదురు.

2. ***అమ్ములపొది:***

యిర్మీయా 5:16 **వారి అమ్ముల పొది తెరచిన సమాధి,** వారందరు బలాఢ్యులు,

**కొంత మంది నోర్లు ఇతరుల పైన 24 గంటలు బాణాలు వేసే పని. ఎదుట మనిషి మనసును హీనపరచి గాయపరుస్తూ, పైశాచిక ఆనందాన్ని అనుభవిస్తూ ఉంటారు. నాకు తెలిసిన ఒక అమ్మాయికి వివాహం కాలేదు. నేను ఆ అమ్మాయి వివాహం కోసం ప్రార్థిస్తుంటే కొందరు నాతో అన్నారు. అన్నా! తనకు వివాహం ఎందుకు? మాటలతోనే అందరిని చంపి Enjoy చేస్తుంది కదా! పెళ్లి చేస్తే వాడు 4 రోజుల్లో ఆ మాటలకే చచ్చిపోతాడు. అందుకే దేవుడు ఆ అమ్మాయికి పెళ్లి చేయడం లేదని. ఈ విషయంలో మనమందరము పరీక్షించుకోవాలి.**

3. ***శాస్త్రులు, పరిసయ్యులు:***

మత్తయి సువార్త 23:27 అయ్యో, **వేషధారులైన శాస్త్రులారా, పరిసయ్యులారా, మీరు సున్నముకొట్టిన సమాధులను పోలియున్నారు.** అవి వెలుపల శృంగారముగా అగపడును గాని లోపల చచ్చినవారి యెముకలతోను సమస్త కల్మషముతోను నిండియున్నవి.

**శాస్త్రులు పరిసయ్యులు సున్నం కొట్టిన సమాధులాగా పైకి సృంగారంగా కనబడుతున్నారు. కాని లోన కుళ్లు, కుతంత్రం వారు నడిచే సమాధులు అని అర్ధం. అలాంటి స్థితి మనకుంటే మారుదాం.**

4. ***కనబడని సమాధులు:***

లూకా సువార్త 11:44 అయ్యో, **మీరు కనబడని సమాధులవలె ఉన్నారు;** వాటిమీద **నడుచు మనుష్యులు (అవి సమాధులని) యెరుగరనెను.**




కొంత మంది కనబడని సమాధులు. వాటి మీద నడిచే వారు కూడా అవి సమాధులని కనుక్కోలేరంట. ఎంత ఘోరం. క్రైస్తవుడు వెలిగే దివ్వెలా ఉండాలి. ఉప్పు పాత్రలా ఉండాలి. రగిలే కొరివి కట్టేలా ఉండాలి. ఆశ్రయ పురంలా ఉండాలి. మనలను చూచి క్రీస్తును లోకం అంగీకరించేలా ఉండాలి కాని, మనలను చూచి లోకం ఎగతాళి చేసే స్థితిలో ఉండకూడదు. మన భక్తి హీనత అన్యులకు ఎగతాళిగా ఉండకూడదు.

ఒకవేళ మనం సమాధుల్లా ఉంటె లెంట్ లో మందిరంలో జీవ వృక్షంలా మారుదాం. మనలోని ఆత్మ ఫలాలు మనుష్యులు రుచి చూచి ప్రభువు వద్దకు వచ్చేలా ప్రయాస పడుదాం.

లెంట్ అంటే దేవునితో ఎక్కువ సమయం గడిపే రోజులు. మనలను మనం శుద్ధి చేసుకొనే రోజులు. మందిరం ఒక ఆత్మీయ బేతెస్ధ కోనేరు. Paralyse అయిన మన ఆత్మీయ జీవితాలను, ఎగిరి గంతేసే జింక పిల్లలా మార్చే చోటు. రండి. మందిరానికి వెళ్దాం. అక్కడే మనం మారుదాం. ఆలాగు చేయడానికి పరిశుద్ధాత్మ దేవుడు సహాయం చేయును గాక! ఆమేన్...! ఆమేన్...! ఆమేన్...!

*క్రీస్తు సమాధిని గెలిచారు? మరి మీరు...?*